# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

15 హైదరాబాద్, ఆదివారం 11 ఫిబ్రవరి 2024 VIKARABAD


## తహసీల్దార్ల బదిలీలు

వికారాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం బదిలీలను చేపట్టింది. శనివారం పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో పని చేస్తున్న నలుగురు తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేయగా, జిల్లాకు ఐదుగురు తహసీల్దార్లు ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చారు. బషీరాబాద్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకట్‌స్వామిని సంగారెడ్డి జిల్లాకు, తాండూరు ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న మహేశ్‌గౌడ్ నల్లగొండ జిల్లాకు, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్‌ను నారాయణపేట్ జిల్లాకు, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నైమత్‌అలీని నారాయణపేట్ జిల్లాకు బదిలీ చేశారు. నల్గొండ జిల్లా గట్టుప్పల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న వి.లావణ్యను, సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నఫీస్ ఫతిమాను, సంగారెడ్డి జిల్లా హత్నూర తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎస్.సంధ్యను, నారాయణపేట్ జిల్లా ఉట్కూర్ తహసీల్దార్‌గా పని చేస్తున్న కె.శివశ్రీనివాస్‌ను, సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ తహసీల్దార్‌గా పని చేస్తున్న గౌరీ వత్సలను వికారాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



చలో నల్గొండ బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి విడుదల చేస్తున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- రూపాయి కేటాయించని కాంగ్రెస్ ప్రభుత్వం
- వికారాబాద్ జిల్లాకు సాగు నీరందడంపై అనుమానాలు
- బీఆర్ఎస్ హయాంలో అధిక శాతం పూర్తైన పనులు
- రూ.వేల కోట్లను ఖర్చు చేసిన గత ప్రభుత్వం
- కాల్వల పనులను చేపట్టేందుకు నిధులు విడుదల
- ఏడాదిలోగా సాగునీరు అందుతుందనుకున్న అన్నదాతల ఆశలపై నీళ్లు



# పాలమూరుకు నిరాశే !

## బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు అంశం

**జిల్లావాసులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసింది. జిల్లాకు సాగునీరందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంపై బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా పూర్తై ఏడాదిలోగా జిల్లాకు సాగునీరు వస్తుందనుకున్న తరుణంలో ప్రభుత్వం మారడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ప్రాజెక్టు పనులపై నీలినీడలు కమ్ముకున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న మంత్రి భట్టి విక్రమార్క

వికారాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మొదటి నుంచీ కేసులు వేసి అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించ లేదు. మరోవైపు జిల్లాకు సాగునీరందించే ప్రాజెక్టును పక్కన బెట్టి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టును మళ్లీ తెరపైకి తీసుకురావడం గమనార్హం. అదేవిధంగా కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కేవలం కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టారు తప్పా జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు సాగునీరందించే అంశాలపై ఎలాంటి ఆలోచన చేయకపోవడం శోచనీయం. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరి స్తున్న తీరుతో జిల్లాకు సాగునీరందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2015లోనే పాల మూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ శంకుస్థాప న చేయగా ఏపీతోపాటు కాంగ్రెస్ నేతలు కేసులు వేయడంతో ఆ పనులు నిలిచిపోయాయి. రెం డేండ్ల క్రితం తాగునీటికి సంబంధించిన పనులు చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతులివ్వగా.. సాగు నీటి పనులు చేపట్టకుండా గ్రీన్‌ట్రిబ్యునల్‌లో వేసిన కేసును పరిశీలించిన ట్రిబ్యునల్ ఏడాది కింద పచ్చజెండా ఊపడంతో పనులు ముమ్మరంగా జరిగాయి. దాదాపుగా 80 శాతం వరకు పూరయ్యాయి. ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయా యి.

### అధిక శాతం పూర్తైన పనులు..

ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు సాగు నీరందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు దాదాపుగా అధిక శాతం వరకు పూర్తయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు నార్లాపూర్ రిజర్వాయర్ లిఫ్ట్-1 వద్ద వెట్‌రన్‌ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని బీడులు బారిన భూములకు సాగునీరందించి ప్రజల ఏండ్ల కలను నెరవేర్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 'పాలమూరు-రంగారెడ్డి' పనులను చేపట్టి రూ. వేల కోట్లను ఖర్చు చేసింది. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కాగా, కేవలం సాగునీరందించేందుకు కాల్వల పనులు చేయాల్సి ఉన్నది. ఇందుకు అవసరమైన నిధులనూ బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసింది. ఏడాదిలోగా సాగు నీరొస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో నిరాశే మిగిలింది. జిల్లాకు ఉద్దండాపూర్ రిజ ర్వాయర్ ద్వారా సాగు, తాగు నీరందించేలా ప్లాన్ చేశారు. 'పాలమూరు-రంగారెడ్డి' పూర్తైతే జిల్లాలోని సుమారు 5లక్షల ఎకరాలకు సాగునీరందడంతోపాటు 566 గ్రామ పంచాయతీల్లోని 910 హ్యాబిటేషన్లకు తాగునీరందించేలా ప్లాన్ రూపొందించారు. గత ప్రభుత్వం కాల్వల ద్వారా కృష్ణా జలాలతో జిల్లాలోని దాదాపు 1000 చెరువులను నింపేందుకు ప్రణాళిక కను రూపొందించింది.

### పాలమూరుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరం..



పాలమూరు ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం బాధాకరం. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలను అవమానపర్చేలా కేటాయింపులు ఉన్నాయి. 40శాతం ఉన్న కార్మి కులు, కనీస వేతనాల అమలుకు, ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌కు సంబంధించి ప్రస్తావిం చలేదు. ఉద్యమకారులకు ఇండ్ల స్థలాల విషయాన్నీ చెప్పలేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయం.

**– భూమొల్ల కృష్ణయ్య, బీఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు**

### అంకెల గారడీలా ఉన్నది..



పాలమూరు ప్రాజెక్టుపై కనీస ప్రస్తావన తీసుకురాలేదు. బడ్జెట్ అంకెల గారడీలా ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. రైతులను దగా చేసింది. డిసెంబర్ 9న రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు.. ఫిబ్రవరి 9వ తేదీ కూడా దాటిపోయింది. రూ.2లక్షల పంట రుణాల మాఫీకి రూ.40 వేల కోట్లు అవసరమని తేల్చిన పాలకులు ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించకపోవడం బాధాకరం. అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్నారు.. అందుకు రూ.15 వేల కోట్లు అవసరమని చెప్పి నిధులను కేటాయించలేదు.

**– మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే**

## నల్గొండ సభకు తరలిరండి

### కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్.. సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఆమనగల్లు, ఫిబ్రవరి 10 : కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13న నల్గొండలో నిర్వహించనున్న బహిరంగ సభకు కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో చలో నల్గొండ సభ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జలాల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ పట్టుదలగా ఉన్నదని, చలో నల్గొండ సభకు అధినేత కేసీఆర్ హాజరై కృష్ణా ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ఎండగట్టనున్నారన్నారు. సమావేశంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి , మాజీ ఎంపీపీ రాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విజయ్‌గౌడ్, లాలయ్యగౌడ్, ఈశ్వరయ్య, భాస్కర్‌రావు, శంకర్, పరమేశ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

### తెలంగాణ ప్రయోజనాలు..

## ఢిల్లీకి తాకట్టు

- తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నది
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- చలో నల్గొండ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 : కృష్ణా జలాల సాధన కోసం ఈనెల 13న నల్గొండలో జరుగనున్న బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ప్రయోజనాలను ఢిల్లీ పాలకులకు తాకట్టు పెడుతున్నదని ఆరోపించారు. దక్షిణ తెలంగాణ ప్రాంతాన్ని ఎడారిగా మార్చేలా కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ ఎంబీకి అప్పగించడం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఘోరమైన తప్పిదమన్నారు. గత పదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ఎంత ఒత్తిడి చేసినా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులను అప్పగించేందుకు అంగీకరించలేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించి తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. దీనికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, రమేశ్‌గౌడ్, రమేశ్, కిషన్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు జంగయ్య, దామోదర్, వేణుగోపాల్‌రావు, పాల్గొన్నారు.

## 13న ఉద్యోగ మేళా

షాబాద్, ఫిబ్రవరి 10: రంగారెడ్డిజిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 13వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఉద్యోగ మేళా ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో రిటైల్, ఈకామర్స్, బీపీవో రంగాల్లో పోస్టులు ఉన్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐఐటీ, డిప్లొమా పూర్తి చేసి, 30 ఏండ్లలోపు వయస్సువారందరూ అర్హులన్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఉపాధి కార్యాలయం, శాంతినగర్ ఐఐటీ క్యాంపస్, మల్లేపల్లి, 9063099306/8977175394 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



ఎన్నికల ఏర్పాట్లపై వివరాలను ఆర్డీవోను అడిగి తెలుసుకుంటున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

### ఈవీఎంల గిడ్డంగిని

## పరిశీలించిన కలెక్టర్

వికారాబాద్, ఫిబ్రవరి 10 : బీయూ, వీవీ ప్యాట్లు, సీయూ మొదటి స్థాయి పరిశీలన క్షుణ్ణంగా చేపట్టడం జరుగుతున్నదని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఈవీఎంల గిడ్డంగిని సందర్శించి బీయూ, వీవీ ప్యాట్లు, సీయూల మొదటి స్థాయి పరిశీలన చేశారు. కలెక్టర్ ఎన్నికల సిబ్బందిని వివిధ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆరు రోజులుగా ఈవీఎంల మొదటి పరిశీలనలో భాగంగా ఇప్పటికీ బీయూలు 45 శాతం, వీవీ ప్యాట్లు 50 శాతం, సీయూలు 60 శాతం ఎఫ్ఎల్‌సీ పూర్తైందన్నారు. మిగతావి నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేసేందుకు ఈసీఐఎల్‌కు చెందిన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో విజయ్‌కుమారి, మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## కొడంగల్ రోడ్లకు రూ.213.20 కోట్లు


### బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 10 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో బీటీ రోడ్ల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 30 బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ.213.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 119 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మించనున్నారు. బొంరాస్‌పేట మండలంలోని మెట్లకుంట నుంచి లోతుకుంట తండా, గుబ్బడి తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.24 కోట్లు, నాగసముందర్ నుంచి దేవనరు, గుబ్బడి, మహంతిపూర్, జానకంపల్లి మీదుగా బొంరాస్‌పేట వరకు బీటీ రోడ్డుతో పాటు, మహంతిపూర్ గ్రామం సమీపంలో కాకరవాణి వాగుపై వంతెన నిర్మాణానికి రూ.23.86 కోట్లు, ఎక్కచెరువు తండాకు రూ.75 లక్షలు, దుద్యాల నుంచి నాచారం మీదుగా అల్లికాన్‌పల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.7.28 కోట్లు, జడ్పీ రోడ్డు నుంచి సంత్రకుంట తండా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.89 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బాపన్‌చెరువు తండా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.58 కోట్లు మంజూరయ్యాయి. దౌల్తాబాద్ మండలంలో అల్లాపూర్ నుంచి బండివాడ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4.16 కోట్లు, తిమ్మారెడ్డిపల్లి నుంచి తిర్మలాపూర్, బానాల మీదుగా నాగసార్ వరకు రోడ్డు, వంతెన నిర్మాణానికి రూ.9.07 కోట్లు, నందారం నుంచి సంగాయపల్లి, కుదురుమల్ల మీదుగా ఇండాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.10.03 కోట్లు, ఇండాపూర్ నుంచి ఈర్లపల్లి మీదుగా ఊరకుంట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.7.30 కోట్లు, చంద్రకల్ నుంచి కుప్పగిరి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5.01 కోట్లు, 163వ నంబరు జాతీయ రహదారి నుంచి బిచ్చాల్ మీదుగా అంతారం వరకు వంతెన, రోడ్డు నిర్మాణానికి రూ.9.93 కోట్లు మంజూరయ్యాయి. కొడంగల్ మండలంలో హస్నాబాద్ నుంచి చిల్‌ముల్‌మైలారం, పలుగురాళ్లతండా మీదుగా ఎక్కచెరువు తండా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.9.59 కోట్లు, జడ్పీ రోడ్డు నుంచి ఖాజాఅహ్మద్‌పల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.33 కోట్లు, అంగడిరాయిచూరు నుంచి లక్ష్మీపల్లి మీదుగా సంగాయపల్లి వరకు రోడ్డు, వంతెన నిర్మాణానికి రూ.4.48 కోట్లు, రుద్రారం నుంచి గొట్టిగకలాన్, పాటిమీదిపల్లి మీదుగా గొట్టిగకుర్దు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.22.88 కోట్లు మంజూరయ్యాయి. మిగతా నిధులు నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూరు మండలాల్లో రోడ్ల నిర్మాణానికి మంజూరయ్యాయి.



## 'మహాలక్ష్మి'కి తిప్పలు

- సర్వర్‌డౌన్‌తో దరఖాస్తుల మార్పులు, చేర్పులకు ఇబ్బంది
- గ్యాస్ నంబర్‌లు సరిగా లేవని తిరిగొచ్చిన వేల దరఖాస్తులు
- మళ్లీ ఫోన్‌లు చేస్తూ.. తలుపు తడుతున్న మున్సిపల్ సిబ్బంది



పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 10: ఆరు గ్యారెంటీల కోసం ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసేందుకు మున్సిపల్ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. వివరాల ఎడిట్ సమయంలో యాప్ ఇబ్బంది పెడుతున్నది. సర్వర్ డౌన్ కావడంతో తిరుగుతూనే ఉన్నదని, కనీసం గంటకు నాలుగు దరఖాస్తులను కూడా నమోదు చేయడం కావడంలేదని సిబ్బంది చెప్తున్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీవ్యాప్తంగా ఆరు గ్యారెంటీల కోసం దాదాపు 17 వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను స్వయంగా స్వీకరించిన మున్సిపల్ సిబ్బంది.. ఆ తర్వాత ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కానీ, దరఖాస్తుదారులు చేసిన అప్లికేషన్‌లలో, నమోదు సమయంలో దొర్లిన తప్పులు ఇప్పుడు తలనొప్పిని తెచ్చి పెడుతున్నాయి. మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో చేసుకున్న దరఖాస్తుల ఆన్‌లైన్ అనంతరం, వివరాలన్నింటినీ కలెక్టరేట్‌కు పంపించారు. అక్కడ గ్యాస్ ఏజెన్సీల నుంచి సేకరించిన వివరాలను, దరఖాస్తుదారులు చేసుకున్న గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన వివరాలతో పోల్చిచూడగా.. వేల సంఖ్యలో తప్పులు దొర్లినట్టు తేలింది.

### మహాలక్ష్మి దరఖాస్తుల్లోనే..

అభయహస్తంలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500 కు ఇచ్చే గ్యాస్ కనెక్షన్ ఇచ్చేందుకు మున్సిపాలిటీలో దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారెంటీల కోసం మున్సిపాలిటీలో దాదాపు 17 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మహాలక్ష్మి పథకం దరఖాస్తు చేసుకునే సమయంలో కన్స్యూమర్ నంబర్‌ను నమోదు చేయాలని సూచించారు. కానీ, చాలామంది వేరే నంబర్‌ను నమోదుచేశారు. దీనికితోడు వివరాలను ఆన్‌లైన్ చేసే సమయంలోనూ కొన్ని తప్పులు దొర్లాయి. మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో కలెక్టరేట్‌లో గ్యాస్ ఏజెన్సీల నుంచి సేకరించిన సమాచారంతో దరఖాస్తు దారుల సమాచారాన్ని పోల్చి చూశారు. ఈ సమయంలో తప్పులు దొర్లినట్టు బయటపడింది. ఒక్క పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోనే 3,624 దరఖాస్తుల్లో తప్పుడు సమాచారం నమోదైనట్టు తేల్చారు. వాటిని సరిచేసి తిరిగి పంపాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండ్రోజులుగా మున్సిపల్ సిబ్బంది వీటిని సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రజాపాలన మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో సరైన సమాచారాన్ని నమోదు చేస్తున్నారు.

తప్పులు దొర్లిన దరఖాస్తుల్లోని చిరునామాల ఆధారంగా ఇంటింటికీ తిరుగుతున్నారు. ఇండ్లకు తాళాలు ఉంటే ఫోన్‌లు చేసి గ్యాస్ కనెక్షన్, వినియోగదారుల నంబర్ ఇతర వివరాలు సేకరిస్తున్నారు. సేకరించడం ఒకత్తయితే.. వాటిని యాప్‌లో నమోదు చేయడం తలనొప్పిగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా మార్పులు చేర్పులు ఉండటంతో సర్వర్ డౌన్‌గా ఉన్నదని, వివరాల నమోదు ఇబ్బందిగా మారిందని సిబ్బంది చెప్తున్నారు. ఒక్కో దరఖాస్తుదారు వివరాలు నమోదు చేసేందుకు దాదాపు 15 నిమిషాల వరకు పడుతున్నదని అంటున్నారు. ఈ ప్రక్రియతో మొబైల్ డాటా అయిపోతుంది కానీ, వివరాల నమోదు త్వరగా కావడం లేదని చెబుతున్నారు.